సాక్షి
చిత్తూరు

బుధవారం । 26 । ఫిబ్రవరి । 2025



సీఎం పర్యటన విజయవంతం చేయండి

జీడీనెల్లూరులో మార్చి 1న సీఎం చంద్రబాబు పర్యటన ఏర్పాట్లను కలెక్టర్, ఎస్పీ కలిసి పరిశీలించారు. - 8లో



సింహవాహనంపై శివతేజం

బంగారుపాళెంలోని మొగిలీశ్వరస్వామి, కామాక్షమ్మ వారు సింహవాహనంపై పురవీధుల్లో విహరించారు. - 8లో



చందాలతో వేసుకున్న రోడ్డుకు బిల్లు

కదిరిముత్తనపల్లిలో చందాలతో వేసుకున్న రోడ్డుకు కూటమి నేతలు బిల్లు పెట్టేందుకు యత్నించడంపై స్థానికులు నిరసన తెలిపారు. - 8లో

న్యూస్‌రీల్

ఆరోగ్య విస్తరణ సేవలపై శిక్షణ

చిత్తూరు రూరల్ (కాణిపాకం) : చిత్తూరు నగరంలోని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో మంగళవారం ఆరోగ్య విస్తరణ సేవలపై స్టాఫ్ నర్సులకు ప్రత్యేక శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. మాత శిశు సంరక్షణ, ప్రసవాలు, విరోచనాలు, అగ్ని బాధితులు, టీబీ, లెప్రసీ తదితర అంశాలపై డీఎంఅండ్‌హెచ్‌ఓ సుధారాణి, జిల్లా క్షయ నివారణ అధికారి వెంకట ప్రసాద్, డీఐఓ హనుమంతరావు శిక్షణ ఇచ్చారు. సేవల అమలు చేసే విషయంలో అలసత్వం చేయవద్దని వారు పేర్కొన్నారు.

పోలీస్‌స్టేషన్‌కు చేరిన ఇంటర్ ప్రశ్నపత్రాలు



ప్రత్యేక వాహనంలో బందోబస్తు నడుమ ప్రశ్నపత్రాలను తరలిస్తున్న అధికారులు

చిత్తూరు కలెక్టరేట్ : ఇంటర్మీడియట్ పరీక్షల నిర్వహణలో కీలకమైన ప్రశ్నపత్రాల పంపిణీ మంగళవారం ముగిసింది. జిల్లా కేంద్రంలోని పీసీఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల స్ట్రాంగ్ రూం నుంచి ప్రశ్నపత్రాల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ప్రత్యేక వాహనాల్లో పోలీసు బందోబస్తు నడుమ పంపిణీ చేశారు. జిల్లాలో 50 పరీక్ష కేంద్రాల్లో ఇంటర్మీడియట్ పరీక్షలు మార్చి1వ తేదీ నుంచి ప్రారంభించనున్నారు. జిల్లాలో గుర్తించిన పరీక్ష కేంద్రాలకు సమీపంలోని పోలీస్ స్టేషన్‌లకు మూడు సెట్ల ప్రశ్నపత్రాలను అందజేశారు. పరీక్షల షెడ్యూల్ మేరకు ఏ రోజుకారోజు ఉన్నతాధికారులు సూచనల మేరకు ప్రశ్నపత్రాలను పోలీస్‌స్టేషన్ల నుంచి తీసుకెళ్లనున్నారు. ప్రశ్నపత్రాల పంపిణీ కార్యక్రమాన్ని డీవీఈఓ సయ్యద్ మౌలా, డీఈసీ సభ్యులు శరత్‌చంద్రశేఖర్, హేమలత పర్యవేక్షించారు.

ఎన్‌హెచ్‌ఎం పోస్టుల తుది జాబితా

చిత్తూరు రూరల్ (కాణిపాకం): ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఎన్‌హెచ్‌ఎం(జాతీయ ఆరోగ్య మిషన్) పరిధిలోని పోస్టుల భర్తీకి సంబంధించిన ఫైనల్ మెరిట్ లిస్టును మంగళవారం డీఎంఅండ్‌హెచ్‌ఓ సుధారాణి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ భర్తీకి సంబంధించి గతేడాది నవంబర్ నెలలో దరఖాస్తులు ఆహ్వానించారు. ఆ మేరకు మెరిట్ లిస్టును ఆన్‌లైన్‌లో ఉంచారు. జాబితా కోసం దరఖాస్తుదారులు వెబ్‌సైట్‌ను www.chittoor.ap.gov.in చూసుకోవచ్చునన్ని ఆమె పేర్కొన్నారు.

జ్వరమా.. జాగ్రత్త!

జిల్లాలో స్క్రబ్ టైఫస్ కోరలు చాస్తోంది. కేసులు క్రమంగా పెరుగుతున్నాయి. బ్యాక్టీరియల్ ఇన్ఫెక్షన్ స్వైరవిహారం చేస్తోంది. టైఫస్ జ్వరాలు ప్రజలను భయాందోళనకు గురిచేస్తున్నాయి. జ్వరమని తేలికగా తీసుకుంటే పలు అవయవాలపై తీవ్ర ప్రభావం చూపుతోంది. మచ్చే కదా అని వదిలేస్తే.. మనిషిని ముంచేస్తోంది.. అవగాహన లోపంతో ప్రజలు ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్నారని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఈ వ్యాధి వ్యాప్తిలో భాగంగా తమిళనాడు ప్రభుత్వం అక్కడి ఆరోగ్యశాఖను అప్రమత్తం చేసింది. ఇక్కడి ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించడం ఆందోళన కలిగిస్తోంది.



పురుగు కుట్టడం వల్ల ఏర్పడే మచ్చ

- కోరలు చాస్తున్న స్క్రబ్ టైఫస్
- జిల్లాలో క్రమంగా పెరుగుతున్న టైఫస్ కేసులు
- జ్వరమని తేలికగా తీసుకుంటున్న జనం
- నిర్లక్ష్యం చేస్తే అవయవాలపై తీవ్ర ప్రభావం
- ప్రభుత్వ ఆస్పత్రుల్లో టైఫస్ పరీక్షలు శూన్యం

కాణిపాకం : స్క్రబ్ టైఫస్ బ్యాక్టీరియల్ ఇన్ఫెక్షన్ బుష్ టైఫస్ అని పిలుస్తారు.. ఇది చిమ్మటలా కనిపించే చిగ్గర్ అనే ఒక రకం కీటకం ద్వారా ఒకరి నుంచి మరొకరికి వ్యాపిస్తుంది. ఈ కీటకం కుట్టినప్పుడు చర్మం ఎర్రబారడం, దురద వంటి లక్షణాలు కనిపిస్తాయి. కీటకం కుట్టడం వల్ల ఓరియెంటియా సుసుగాముషి అనే బ్యాక్టీరియ్ దేహంలోకి ప్రవేశించడంతో ఈ స్క్రబ్ టైఫస్ ఇన్ఫెక్షన్ వస్తుంది. దట్టమైన చెట్లు, వ్యవసాయ భూములు పక్కన నివశించే వారికి ఎక్కువగా ఈ వ్యాధి బారీన పడుతారు. చెట్లు, పొలాల్లో ఉండే ఈ కీటకం కుట్టడం ద్వారా జ్వరం వస్తుంది. ఈ కీటకాల్లో కొన్ని తీవ్రమైన ప్రభావం చూపుతాయి. కొందరికి వారం రోజుల వ్యవధిలో వ్యాధి సోకుతుందని, మరికొందరిలో కొన్ని గంటల వ్యవధిలోనే తీవ్ర ప్రభావం చూపుతుందని వైద్యులు చెబుతున్నారు. ఇలాంటి వారి శరీరం పరిశీలిస్తే కీటకం కుట్టిన ప్రాంతంలో నల్లటి మచ్చ కనిపిస్తుంది.

వ్యాధి లక్షణాలు ఇలా..

- అధిక జ్వరం
- తీవ్రమైన చలి
- పొడిదగ్గు
- తీవ్రమైన తలనొప్పి, శరీర నొప్పులు, నీరసం
- ఎరుపు మచ్చలు లేదా శరీరంపై దద్దుర్లు
- ముదిరితే కామెర్లు, ఫిట్స్ లక్షణాలు

అవగాహన లేకపోవడం

జిల్లాలో స్క్రబ్ టైఫస్ జ్వర లక్షణాలతో రోగులు ఆస్పత్రులకు రావడం ఆందోళన కలిగిస్తోంది. చిత్తూరు, పూతలపట్టు, గుడిపాల మండలాల్లో పలువురికి స్క్రబ్ టైఫస్ లక్షణాలు కనిపించాయి. గతేడాది ఈ తరహా జ్వరంతో కొందరు పలు ప్రైవేటు ఆస్పత్రులకు వెళ్లి చికిత్స పొందుతున్నారు. అంతటి ప్రమాదకరమైన వ్యాధిపై వైద్య ఆరోగ్యశాఖ సిబ్బందికి పెద్దగా అవగాహన లేదనే చెప్పాలి. జిల్లాలో సోకుతున్న ఈ వ్యాధిపై ప్రభుత్వ వైద్యులకు తప్పనిసరిగా అవగాహన ఉండాలని వైద్య నిపుణులు సూచిస్తున్నారు. సాధారణ జ్వరంలా కనిపించే స్క్రబ్ టైఫస్‌ను సకాలంలో గుర్తించకుంటే ప్రాణాలు కోల్పోతారని హెచ్చరిస్తున్నారు.

వ్యాధి వ్యాప్తితో అవయవాలపై ప్రభావం

- న్యూమోనైటిస్
- తీవ్రమైన ఊపిరితిత్తుల గాయం
- ఎక్యుట్ రెస్పిరేటరీ డిస్ట్రెస్ సిండ్రోమ్ ప్రభావం
- కిడ్నీలు ఫెయిల్యూర్ కావడం
- హృదయ కండరాల వాపు
- సెప్టిక్ షాక్
- అంతర్గత రక్తస్రావం
- తెల్ల రక్తకణాలు తగ్గిపోవడం
- కాలేయం, మూత్ర పిండాల పనితీరు అసాధారణ స్థితి చూపడం
- సకాలంలో గుర్తించి వైద్యం పొందితే బయటపడొచ్చునని వైద్యుల సూచన



- పూతలపట్టు మండలం వావిల్ తోట పంచాయతీ అబ్బిరెడ్డి గ్రామానికి చెందిన ఓ మహిళకు వారం కిందట జ్వరం వచ్చింది. జ్వరంతో పాటు తలనొప్పి, నీరసం, ఒళ్లు నొప్పులు ఉండడంతో వైరల్ ఫీవర్‌గా భావించారు. జ్వరం మాత్రలు మింగి తగ్గిపోతుందిలే అనుకున్నారు. తీరా చూస్తే తీవ్రత పెరిగింది. దీంతో కుటుంబీకులు చిత్తూరు నగరం ఆర్టీసీ బస్టాండు సమీపంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తీసుకొచ్చారు. అక్కడ పరీక్షిస్తే స్క్రబ్ టైఫస్‌గా బయట పడింది. ఈనెల 19 నుంచి చికిత్స తీసుకుంటున్నారు.
- ఈనెల 2వ తేది పూతలపట్టు మండలం తలపులపల్లి గ్రామంలో మరో కేసు వెలుగుచూసింది. 49 ఏళ్ల మహిళకు జ్వరం వచ్చింది. ఆ జ్వరం తీవ్రంగా మారింది. మందులు, మాత్రలు వాడినా ప్రయోజనం లేకపోవడంతో అయిదు రోజుల పాటు జ్వరంతో అల్లాడిపోయింది. బయట ఆస్పత్రుల్లో చూపించినా తగ్గకపోవడంతో చిత్తూరు నగరంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిని ఆశ్రయించింది. అక్కడి వైద్యులు అన్ని రకాల పరీక్షలు చేసి స్క్రబ్ టైఫస్‌గా నిర్ధారించారు. ఆపై సరైనా వైద్య సేవలు అందించడంతో 10 రోజుల కిందట డిశ్చార్జ్ అయింది. ఇలాంటి కేసులు ఈరెండు మాత్రమే కాదు..జిల్లాలో పదుల సంఖ్యలో నమోదు అవుతూ కలవరానికి గురి చేస్తోంది.

జిల్లాలో ఫీవర్ కేసులు ఇలా..

నెల	ఫీవర్ కేసుల సంఖ్య
నవంబర్-2024	5,289
డిసెంబర్-2024	4,640
జనవరి-2025	4,425
ఫ్రిబవరి-2025	3,502

ప్రభుత్వ ఆస్పత్రుల్లో పరీక్ష కిట్లు లేవు...

ఈ వ్యాధి నిర్ధారణకు వెయిల్ ఫెలిక్స్ పరీక్ష, ఇన్డైరెక్ట్ ఇమ్యూనో ఫ్లోరోసెంట్ యాంటీబాడీ (ఐఎఫ్ఎ) పరీక్ష, ఇన్డైరెక్ట్ ఇమ్యూనో పెరాక్సిడేజ్ (ఐపీపీ) పరీక్ష, ఎలీజా, ఇమ్యూనో క్రొమాటోగ్రాఫిక్ టెస్ట్ (ఐసీటీ), పీసీఆర్ పరీక్షల ద్వారా దీన్ని నిర్ధారణ చేసుకోవచ్చు. అయితే చాలా రకాల బ్యాక్టీరియల్ ఇన్ఫెక్షన్లలో దాదాపుగా ఇవే లక్షణాలు కనిపిస్తాయి. బ్యాక్టీరియల్ ఇన్ఫెక్షన్లో తగిన మోతాదులో యాంటీ బయాటిక్ చికిత్స చేసి, బాధితుల పరిస్థితిని సాధారణ స్థితికి తీసుకురావచ్చు. అందుకే ఖరీదైన పరీక్షలకు బదులు కాస్తంత అనుభవజ్ఞులైన డాక్టర్లు కొన్ని లక్షణాల ఆధారంగా బ్యాక్టీరియల్ ఇన్ఫెక్షన్లు గుర్తిస్తారు. ఈ వ్యాధి నిర్ధారణకు జిల్లాలోని ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఎలాంటి కిట్లు, పరీక్షలు లేవని వైద్యులే చెబుతున్నారు.

నిర్లక్ష్యం చేయొద్దు



జ్వరం రెండు, మూడు రోజులు ఉంటే పర్వాలేదు. దానికి మించి జ్వరం ఉంటే కచ్చితంగా వైద్యులను సంప్రదించాలి. పలు పరీక్షలు చేసుకుని జ్వర కారణాలను నిర్ధారణ చేసుకోవాలి. వీటిని లెక్క చేయకుండా రెండు మందు బిళ్లలు మింగితే తగ్గిపోతుందని తేలికగా తీసుకోవద్దు. జ్వరం ఒక్కోసారి ప్రాణం మీదకు వస్తుంది. ఆ రకంలో ఈ స్క్రబ్ టైఫస్ ఒకటి. ఈ వ్యాధిని అశ్రద్ధ చేస్తే ఊపిరితిత్తులు, ఇతర అవయవాలపై ప్రభావం చూపి, ప్రాణాంతకంగా మారవచ్చు. ఈ వ్యాధి వచ్చిన వారి శరీరంపై మచ్చలను గమనించవచ్చు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. సకాలంలో స్క్రబ్ టైఫస్‌ను గుర్తించి చికిత్స తీసుకోవాలి.

– డాక్టర్ అశోక్‌కుమార్, పల్మోనాలజిస్ట్, క్రిటికల్ కేర్ ఫిజీషియన్, చిత్తూరు

అధికారులు బాధ్యతగా పనిచేయాలి



పాల్గొన్న ఏఓలు



మాట్లాడుతున్న జెడ్పీ సీఈఓ

చిత్తూరు కార్పొరేషన్ : మండల కేంద్రాల్లో అధికారులు బాధ్యతగా పనిచేయాలని జెడ్పీ సీఈఓ రవికుమార్‌నాయుడు హెచ్చరించారు. మంగళవారం జెడ్పీ సమావేశ మందిరంలో జెడ్పీ కార్యాలయ, జిల్లాలోని ఎంపీడీఓ కార్యాలయ ఏఓలతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. నిబంధనల మేరకు ప్రతి ఒక్కరూ పనిచేయాలన్నారు. నెలకు 2 సార్లు ఎం-బుక్‌లను పరిశీలించి ఉన్నతాధికారులకు నివేదించాలన్నారు. ఎంబుక్‌లను ఉద్యోగులు జెడ్పీకి తీసుకురావాలని, కాంట్రాక్టర్లతో పంపరాదన్నారు. క్షేత్రస్థాయిలో అభివృద్ధి పనుల ప్రారంభానికి ముందు, పూర్తయ్యాక ఫొటోలను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలన్నారు.నిర్లక్ష్యంగా పనిచేస్తే చర్యలు తీసుకుంటామన్నారు. వేసవిలో నీటి సమస్య రాకుండా ముందు జాగ్రత్త తీసుకోవాలన్నారు. ఆకస్మికంగా ఎంపీడీఓ కార్యాలయాలకు తనిఖీలకు వెళ్లినప్పుడు పలు విషయాలు తెలుస్తున్నాయన్నారు. కార్యాలయంలో ఒకరి పైనే పని ఒత్తిడి పడుతోందన్నారు. కొందరు పనులు చేయకుండా సాకులు చెబుతున్నట్లు తెలుస్తోందన్నారు. కొందరు పదవీ విరమణకు దగ్గరలో ఉన్నారని, మరికొందరు కంప్యూటర్ పరిజ్ఞానం లేదని ఏదో సాకులు కాలయాపన చేస్తున్నారన్నారు. ఇంక పలువురికి ఈ-ఆఫీసు మీద పరిజ్ఞానం లేదన్నారు. విధి నిర్వహణలో కక్కుర్తి పడి తప్పులు చేస్తే ఎప్పటికైన శిక్ష అనుభవించక తప్పదన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ సీఈఓ జుబేదా తదితరులు పాల్గొన్నారు.

సీఎం పర్యటన ఏర్పాట్లు పక్కాగా చేపట్టండి



మాట్లాడుతున్న కలెక్టర్ సుమిత్‌కుమార్ గాంధీ.. హాజరైన అధికారులు

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాకు విచ్చేస్తున్న సీఎం చంద్రబాబునాయుడు పర్యటనకు అప్పగించిన ఏర్పాట్లు పక్కాగా చేపట్టాలని కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లో పలు శాఖల అధికారులతో సీఎం పర్యటనపై సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లా లోని గంగాధర నెల్లూరు మండలానికి మార్చి1వ తేదీన సీఎం వస్తున్నారన్నారు. పింఛన్ పంపిణీ కార్యక్రమంలో సీఎం హాజరై లబ్ధిదారులకు పింఛన్ అందజేస్తారని తెలిపారు. సీఎం పర్యటనను విజయవంతం చేసేందుకు ఆయా శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలన్నారు. అప్పగించిన విధుల పట్ల ఎలాంటి అలసత్వం వహించకూడదని కోరారు. హెలిప్యాడ్, సీఎం చేతుల మీదుగా పింఛన్‌ల పంపిణీ, ప్రజావేదిక కార్యక్రమాలకు పక డ్బందీ ఏర్పాట్లు చేయాలన్నారు. తాగునీటి వసతి, బారికేడ్లు, పార్కింగ్, భద్రత ఏర్పాట్లను సమర్థవంతంగా చేపట్టాలన్నారు. సీఎం పర్యటనను ప్రతిష్ఠాత్మకంగా భావించి విధులు నిర్వర్తించాలన్నారు. హెలీప్యాడ్ ఏర్పాటుకు ఆర్అండ్‌బీ అధికారులు ఇప్పటికే పనులు ప్రారంభించారని చెప్పారు. స్టాల్స్ ఏర్పాటు చేయాల్సిన అధికారులు సంబంధిత పూర్తి సమాచారాన్ని వెంటనే తెలియజేయాలన్నారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ విద్యాధరి, డీఆర్ఓ మోహన్‌కుమార్, ఏఆర్ ఏఎస్పీ శివానందకిశోర్, జెడ్పీ సీఈఓ రవికుమార్‌నాయుడు, ఇతర శాఖల అధికారులు చంద్రశేఖర్‌రెడ్డి, రవికుమార్, శ్రీనివాసులు పాల్గొన్నారు.

భద్రతా ప్రమాణాలు పాటించాలి

చిత్తూరు కార్పొరేషన్ : జిల్లాలోని శివాలయాల్లో శివరాత్రి సందర్భంగా భద్రతా ప్రమాణాలు పాటించాలని ట్రాన్స్‌కో చీఫ్ విజిలెన్స్ ఆఫీసర్ జనార్దన్‌నాయుడు తెలిపారు. బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ దేవాలయాల్లో లూజు, ఓపెన్ వైర్లు ఉండరాదన్నారు. విద్యుత్ సరఫరా కోసం ఎర్త్ లీకేజ్ సర్క్యూట్ బ్రేకర్‌గా అమర్చుకోవాలని చెప్పారు. లైన్‌ల నుంచి వచ్చే వైర్ల ద్వారా దేవాలయానికి సరఫరా అయ్యే చోట ఈ బ్రేకర్‌ను పెట్టాలన్నారు. ఆలయానికి విద్యుత్ అందించే వైర్లు 2.5 చదరపు మిల్లీ మీటర్ల కంటే తక్కువగా ఉండరాదన్నారు. సిల్క్ వైర్లను వాడటం మంచిదికాదని, ప్రతి సర్క్యూట్‌కు ప్రత్యేకించి న్యూట్రల్ ఎర్తవైర్‌ను తీసుకోవాలని సూచించారు. ఉత్సవమూర్తుల ఊరేగింపు సమయంలో విద్యుత్ అధికారుల సహాయ సహకారాలతో భద్రతా చర్యలు పాటించాలన్నారు.

ఉపాధిహామీ పనులు కింద చేపట్టిన సీసీ రోడ్లు కూటమి నేతలకు కాసుల వర్షం కురిపించాయి. అవసరం ఉన్నచోట్ల రోడ్లు వేయడం కంటే..తమ్ముళ్లు ఎక్కడ చెబితే అక్కడ రోడ్లు వేసి అధికారులు కూటమి భక్తి చాటుకున్నారు. ఒక ఇంటికే దర్జాగా సీసీ రోడ్డు వేసినా అధికారులు కళ్లప్పగించి చూసారే కానీ అడ్డు చెప్పకపోవడం విస్మయానికి గురిచేస్తోంది. వేసిన రోడ్లు సైతం నాసిరకంగా వేసి నాణ్యతకు తీలోదకాలు ఇచ్చారు. అందినకాడికి నేతలు దోచుకొని జేబులు నింపుకోవడంపై ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

దారి దోపిడీ

- కాసులు కురిపించిన 'ఉపాధి' రోడ్లు
- సందు గొందుల్లోనూ సీసీ రహదారులు
- వైఎస్సార్‌సీపీ వాళ్లున్న చోట రోడ్లు వేయని వైనం
- సీసీ రోడ్ల ఎంపికల్లో కూటమి నేతల ఇష్టారాజ్యం
- నాణ్యతకు తిలోదకాలు
- ప్రేక్షకపాత్ర పోషిస్తున్న అధికారులు



నూనెవారిపల్లి, జంగాళపల్లిలో ప్రారంభం కాని పనులు

పలమనేరు : కూలీలకు ఉపాధి కల్పించాలనే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం చేపట్టిన మహాత్మ గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం కూటమి ప్రభుత్వంలో ఆ పార్టీ నాయకులకు ఉపాధిని కల్పించే పథకంగా పలమనేరు నియోజకవర్గంలో మారింది. తమకిష్టమైన చోట పనులు, కావాల్సిన వారికి సీసీ రోడ్లు, కాంట్రాక్టు పొందిన వారు మరొకరికి కమీషన్ కింద పనులు, పలుచోట్ల నాసిరకంగానే పనులతో ప్రజాధనాన్ని కూటమి నేతలు ఎడాపెడా మేసేశారు.

నేతలు ఎక్కడ చెబితే అక్కడే పనులు

పలమనేరు మండలంలో కూటమి నేతలు ముందుగా ఎక్కడ చెబితే అక్కడ మాత్రం పనులను చేపడుతున్న పంచాయతీ రాజ్ శాఖ అధికారులు అంచనాలను సిద్ధం చేశారు. ముఖ్యంగా గతంలో సీసీ రోడ్లు వేసి దెబ్బ తిన్నవి లేదా అవసరమైన వీధుల్లో వీటిని వేయకుండా టీడీపీ నాయకులు సూచించిన వీధుల్లో పనులను చేపట్టారనే విమర్శలున్నాయి. కొన్ని గ్రామాల్లో టీడీపీ సానుభూతి పరుల ఇళ్లకు వీలుగా సీసీ రోడ్లను నిర్మించడం విమర్శలకు తావిస్తోంది.

కమీషన్‌లు తీసుకొని వదిలేసి..

కొందరు సీసీ రోడ్ల పనులను చేజిక్కించుకొని వాటిని ఎంతో కొంత కమీషన్ తీసుకొని డబ్బులున్న కాంట్రాక్టర్లకు అంటగట్టి పనులు చేపించారనే విమర్శలు ఉన్నాయి. ఉపాధి పనులు కూటమి నేతల జేబులు నింపేందుకు తప్ప గ్రామాల్లోని ప్రజలకు పెద్దగా ఉపయోగం లేదనే ఆరోపణలు గుప్పుమంటున్నాయి. దీనిపై సంబంధిత అధికారులను అడిగినా మాదేముంది అంతా అధికారంలోని వారి ఇష్టమే కదా అనే మాట వినిపిస్తోంది.

నాణ్యత ప్రమాణాలేవీ...?

సీసీరోడ్ల నిర్మాణాల్లో నిబంధనలు కూటమి కాంట్రాక్టర్లు పట్టించుకోవడం లేదు. సీసీ రోడ్డు కింద పట్ట, బెర్మలు కనిపించలేదు. బస్తా సిమెంట్‌కు రెండు బస్తాల ఇసుక, నాలుగు తట్టల కంకర వేయాలి. వీటిని పెద్దగా పాటించలేదు. ఇక కాంక్రీట్ మిక్చర్ లోనూ తక్కువరేటున్న సిమెంట్‌ను వాడారు. ఇన్నాళ్లకు డబ్బు సంపాదించుకొనే అవకాశం దక్కిన కూటమి కాంట్రాక్టర్లు దొరికినంత సంపాదించేందుకు నాణ్యతకు తిలోదకాలిచ్చారనే విమర్శలు ఉన్నాయి.

పలమనేరు మండలంలో పరిస్థితి ఇలా..

- పలమనేరు మండలంలోని మొరం పంచాయతీలోని రాజీవ్‌నగర్ కాలనీలో డ్రైన్లకు మంజూరైన నిధులను సీసీ రోడ్డుకు వినియోగించుకున్నారు. గతంలో గ్రామానికి వేసిన సీసీ రోడ్డుకు మిగిలిన చోట మాత్రం సీసీ రోడ్డును వేశారు.
- జరావారిపల్లిలో ఇంకా సీసీ రోడ్ల పనులు మొదలు కాలేదు. ఇదే పంచాయతీలో పందేరుపల్లి సమీపంలోని తెల్లగుండ్లపల్లి కాలనీకి రోడ్డు దెబ్బతిన్నా సీసీ రోడ్డుకు ఎంపిక చేయలేదు.
- సముద్రపల్లి పంచాయతీ నూనేవారిపల్లిలో ఎంపిక చేసిన వీధిలో పనులు ఇంకా చేపట్టలేదు.
- జంగాళపల్లిలో అనవసరమైన వీధుల్లో ఇప్పటికే సీసీ రోడ్లను వేశారు. అక్కడ వైఎస్సార్‌సీపీ సానుభూతి పరులున్న వీధులను పట్టించుకోలేదు.
- కోతిగుట్టలో కేవలం టీడీపీ సానుభూతిపరుడి ఇంటికి సౌకర్యంగా సీసీ రోడ్డును నిర్మించారు.
- మండలంలో సాగిన ఈ పనులు పలుచోట్ల నాసిరకంగా ఉన్నా సంబంధిత శాఖ అధికారులు నోరు మెదపకపోవడం విస్మయానికి గురిచేస్తోంది.

పలమనేరు మండలంలో పనులు ఇలా..

సచివాలయాలు	12
మొత్తం పంచాయతీలు	10
గ్రామాలు	56
మంజూరైన పనులు	34
మంజూరైన మీటర్లు	3758
ఇప్పటిదాకా పూర్తయిన పనులు	27
ఇష్టాను సారంగా వేసిన పనులు	4
రోడ్లపైనే వేసిన రోడ్లు	1
అనుమతి లేకుండా వేసిన రోడ్లు	2
నాసిరకంగా ఉన్న రోడ్లు	4
బిల్లుల చెల్లింపులు	రూ. 1 కోటి
పనులు దక్కించుకున్న కూటమి నేతలు	34 మంది

30 నుంచి 40 శాతం నేతల జేబుల్లోకి...

పలమనేరు మండలంలో జరిగిన పనుల్లో వాటిని దక్కించుకున్న నేతలకు 30 నుంచి 40 శాతం జేబుల్లోకి అక్రమంగా వెళ్లినట్లు ఆరోపణలు ఉన్నాయి. గతంలో ఇదే సీసీ రోడ్లను వేసిన కాంట్రాక్టర్లకు పది శాతం దక్కేది గగనంగా ఉండేది.. కానీ కూటమి నేతలు నాసిరంగా పనులు చేపట్టి దొరినంత దోచుకున్నట్లు తెలుస్తోంది. ఈ పనులపై క్వాలిటీ కంట్రోల్ అధికారులు సైతం అధికార పార్టీ నేతలు కావడంతో చేసేదేమీ లేకుండా మొక్కుబడిగా తనిఖీలు చేసి మమ అనిపించి కూటమి నేతలకు దాసోహమయ్యారు.



మొరం పంచాయతీ రాజీవ్‌నగర్ కాలనీలో గతంలో వేసిన సీసీ రోడ్డు



గతంలో వేసిన రోడ్డు గ్యాప్‌కు సీసీ రోడ్డును వేసిన దృశ్యం



ఇంకా పనులు ప్రారంభం కాని జారావారిపల్లి వీధులు

క్లుప్తంగా

మహిళపై దాడి

శ్రీరంగరాజపురం : మహిళపై ఓ వ్యక్తి దాడి చేసిన ఘటన మండలంలోని దిగువ కమ్మకండ్రిగ గ్రామంలో సోమవారం రాత్రి చోటు చేసుకుంది. బాధితురాలు సబ్బులక్ష్మి కథనం మేరకు.. తన భర్త వెంకటేష్ ఫీల్డ్ అసిస్టెంట్‌గా ఎగువ కమ్మకండ్రిగ పంచాయతీలో విధులు నిర్వహిస్తుండగా కొంత మంది వ్యక్తులు అవినీతి ఆరోపణలు చేస్తూ కలెక్టర్, స్థానిక ఎమ్మెల్యేకు ఫిర్యాదు చేశారు. దీంతో కలెక్టర్ విచారణకు ఆదేశించారు. సోమవారం జిల్లా స్థాయి అధికారులు ఎగువ కమ్మకండ్రిగ పంచాయతీ ప్రజలను విచారించారు. ఈ విచారణలో ఫీల్డ్ అసిస్టెంట్‌పై ఎటువంటి ఆరోపణలు రాకపోవడంతో జిల్లా అధికారులు క్లీన్ చిట్ ఇచ్చారు. దీనిని జీర్ణించుకోలేని రమేష్, అమరేంద్రన్ కలసి వెంకటేష్ భార్య అయిన తనపై దాడి చేసినట్లు పేర్కొన్నారు. తనకు, తన భర్త వెంకటేష్‌కు ప్రాణహాని ఉందని రక్షణ కల్పించాలని బాధితురాలు స్థానిక పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

కన్నీటి వీడ్కోలు

కుప్పంరూరల్ : మండలంలోని మల్లానూరు గ్రామంలో ఆదివారం జరిగిన జల్లికట్టులో ఎద్దును నిలువరించేందుకు వెళ్లి గాయపడిన కరుణాకరన్‌కు మంగళవారం అంత్యక్రియలు నిర్వహించారు. కరుణాకరన్ ఆదివారం గాయపడగా వేలూరు సీఎంసీలో చికిత్స పొందుతూ సోమవారం ఉదయం మృతి చెందాడు. మంగళవారం మృతదేహాన్ని సీఎంసీ నుంచి కుప్పం తీసుకొచ్చారు. ఇక్కడ వంద పడకల ఆస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అందజేశారు. సాయంత్రం కుటుంబ సభ్యులు, బంధువులు కరుణాకరన్ మృతదేహానికి అంత్యక్రియలు నిర్వహించారు. నిన్నటి వరకు తమ మధ్యనే ఉన్న కరుణాకరన్ మృతిని జీర్ణించుకోలేని గ్రామస్తులు కన్నీటి పర్యంతమయ్యారు. కాగా కరుణాకరన్‌కు భార్య, ఒక కుమార్తె ఉన్నారు.

బోల్తా పడిన ట్రాక్టర్

- డ్రైవర్, ముగ్గురు కూలీలకు గాయాలు



పులికల్లు వద్ద బోల్తా పడిన ట్రాక్టర్

పెనుమూరు(కార్వేటినగరం) : ఇటుక రాళ్ల లోడ్‌తో వెళుతున్న ట్రాక్టర్ అదుపు తప్పి బోల్తా పడి డ్రైవర్, ముగ్గురు కూలీలకు గాయాలైన సంఘటన మండల పరిధిలోని పులికల్లు వద్ద చోటు చేసుకుంది. స్థానికుల కథనం మేరకు వివరాలు ఇలా.. బందార్లపల్లికి చెందిన రామనాథరెడ్డికి చెందిన ట్రాక్టర్‌లో ఇటుకలను పెనుమూరుకు తీసుకెళుతుండగా పులికల్లు పాఠశాల సమీపంలోని మలుపు వద్ద ట్రాక్టర్ అదుపు తప్పి బోల్తా పడింది. ట్రాక్టర్ డ్రైవర్‌తో పాటు మరో ముగ్గురు కూలీలకు గాయాల య్యాయి. వారిని చిత్తూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అయితే గాయపడిన నలుగురు ఇతర రాష్ట్రాలకు చెందిన కూలీలుగా గుర్తించారు.

ఆటగదరా శివ..

- గత ఏడాది శివరాత్రిన భర్తను ఏమార్చి.. ప్రియుడితో వెళ్లిన వివాహిత
- మళ్లీ ఈ ఏట శివరాత్రి ఉత్సవాలలో ఆత్మహత్యకు పాల్పడిన మహిళ



కోమల (ఫైల్)



వినయ్ (ఫైల్)

పలమనేరు : కర్మ సిద్ధాంతం ఉందనే మాట మళ్లీ జనానికి గుర్తు చేసిన ఘటన సోమవారం పలమనేరులో వెలుగు చూసింది. మున్సిపాలిటీ పరిధిలోని బోడిరెడ్డిపల్లికి చెందిన జగన్నాథం భార్య కోమల (36) ఇంట్లో గొడవ జరిగి రెండు రోజుల కిందట జల్లిపేట చెరువులో దూకి ఆత్మహత్య చేసుకొంది. వీరికి వివాహం జరిగి ఏడేళ్లు అయింది. వీరికి ఇద్దరు పిల్లలున్నారు. సోమవారం ఉదయం దంపతుల మధ్య చిన్నపాటి గొడవ జరిగింది. దీంతో ఆమె మనస్తాపానికి గురై పక్కనే ఉన్న జల్లిపేట చెరువులో ఆత్మహత్యకు పాల్పడింది. ఇది సాధారణ ఆత్మహత్య అనుకుంటే పొరబాటే. దీని వెనుక ఏడాది కిందట శివరాత్రి నాటి కథ తెలియాల్సిందే.

గత శివరాత్రి నాడు ఏం జరిగిందంటే...

గడ్డూరుకు చెందిన కోమల ఇదే మండలంలోని కొలమాసనపల్లికి చెందిన ప్రియుడు గౌతం(26)తో కలిసి వెళ్లేందుకు శివరాత్రి జాగరణ పేరిట గుడికి వెళుతున్నానంటూ భర్తను నమ్మించి ఇంటి నుంచి బయటకు వచ్చింది. ఇంటి బయట బైక్‌పై ఉన్న ప్రియుడితో కలసి గడ్డూరు నుంచి పట్టణ సమీపంలోని జగమర్ల అడవిలోకి వెళ్లారు. అడవిలోకి ఎవరైనా ప్రేమికులు కలుసుకొనేందుకు వస్తే వారిని బెదిరించి బంగారం, డబ్బులు, స్మార్ట్‌ఫోన్లు చోరీ చేసి మహిళలను రేప్ చేయడంతో ఓ సైకో దిట్ట. ఇతడిపై పలు రాష్ట్రాల్లో ఇలాంటి కేసులు చాలానే ఉన్నాయి. ఈ నేపథ్యంలో కోమల, గౌతం అడవిలో ఉండగా చెట్టుపై మాటువేసిన సైకో వినయ్ వీరిని బెదిరించాడు. డబ్బు, మహిళపై ఉన్న బంగారాన్ని ఇవ్వాలన్నాడు. అందుకు వారు అడ్డం తిరగ్గా తన వద్దనున్న రాడ్‌తో కొట్టేందుకు గౌతంను చంపేందుకు ప్రయత్నించాడు. దీంతో గౌతం అక్కడున్న బండరాయితో వినయ్‌పై పడేశాడు దీంతో అతను అక్కడిక్కడే మృతి చెందాడు. ఆపై ఏమీ తెలియనట్లు వీరు అక్కడి నుంచి వెళ్లిపోయారు.ఈ విషయం మూడురోజుల తర్వాత వెలుగు చూసింది. ఇదే సమయంలో తామే హత్య చేశామంటూ కోమల, గౌతం స్థానిక పోలీసుల వద్దకు రావడంతో మొత్తం విషయం బయటపడింది. మృతుడు పెద్దపంజాణి మండలం శివాడికి చెందిన వినయ్ (30)గా పోలీసులు గుర్తించారు. ఇలా ఉండగా శివాడి గ్రామానికి చెందిన శివశంకర్ కుమారుడైన వినయ్ గత కొన్నేళ్ల నుంచి చెడు వ్యసనాలకు బానిసై సంచార జీవనం సాగిస్తూ గంజాయి అక్రమరవాణా, చోరీలకు పాల్పడేవాడు. ఇతనిపై గంగవరంతో పాటు కర్ణాటకలోని పలు స్టేషన్లలో కేసులు నమోదైనట్లు తెలిసింది. ఈ నేపథ్యంలో సైకోగా మారిన వినయ్ పట్టణ సమీపంలోని జగమర్ల అడవిలో పగలు, రాత్రి ఉంటూ ఏకాంతం కోసం అక్కడికి వెళ్లే ప్రేమికులను బెదిరించడం చేసేవాడు. ఈ నేపథ్యంలో వీరిని బెదిరించడం జరిగి ఆపై గొడవల్లో ప్రేమికుల చేతుల్లో ఇతను హత్యకు గురయ్యాడు.

ఇప్పుడేమైందంటే...

నాడు శివరాత్రి జాగారణకు గుడికి వెళ్లి వస్తానని భర్తను ఏ మార్చి ప్రియుడితో వెళ్లి ఓ సైకో ను చంపి ఆపై ఆరునెలలు జైల్లో ఉండి బెయిల్‌పై వచ్చిన కోమల ఆపై తన ఇరువురు బిడ్డలను బాగా చూసుకుంటూ భర్తతో కలసి ఇకపై ఎలాంటి తప్పులు చేయకుండా జీవనం సాగించింది. సోమవారం ఉదయం దంపతుల మధ్య చిన్నపాటి గొడవ జరిగింది. దీంతో ఆమె మనస్తాపానికి గురై పక్కనే ఉన్న జల్లిపేట చెరువులో ఆత్మహత్య చేసుకొంది. స్థానిక ఫైర్ సిబ్బంది ఆమె మృతదేహాన్ని వెలుపలికి తీశారు. దీనిపై స్థానిక పోలీసులు కేసు నమోదు చేసి విచారిస్తున్నారు. ఇలా ఉండగా గత శివరాత్రి నుంచి ఈ శివరాత్రిలోపు జరిగిన ఘటనలను గమనించిన స్థానికులు కర్మ సిద్ధాంతం ఉందయ్యా శివయ్యా అంటూ జనం చర్చించుకోవడం ఆశ్చర్యానికి గురిచేసింది.

పెట్టుబడి పెట్టండి..తిరిగొస్తుందిలే.!

- కుప్పంలో 7489 ఎస్సీ, ఎస్టీ గృహాలకు సోలార్ రూఫ్ టాప్

సాక్షి, అమరావతి: కుప్పం నియోజకవర్గంలోని 7489 ఎస్సీ, ఎస్టీ గృహ విద్యుత్ వినియోగదారులకు సోలార్ రూఫ్ టాప్ ఏర్పాటుకు కుప్పం రూరల్ ఎలక్ట్రిక్ కో ఆపరేటివ్ సొసైటీ లిమిటెడ్(కెఆర్‌ఈసీఎస్‌ఎల్) సమర్పించిన డీటైల్డ్ ప్రాజెక్ట్ రిపోర్ట్(డీపీఆర్)ను రాష్ట్ర ప్రభుత్వం ఆమోదించింది. ఈ మేరకు ఇంధన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇదే నియోజకవర్గంలో 30వేల వ్యవసాయ పంపుసెట్లను సోలరైజ్ చేసే ప్రాజెక్టును కూడా అదే డీపీఆర్‌లో పొందుపరిచారు. దానికి కూడా ప్రభుత్వం అనుమతించింది. అయితే ఈ ప్రాజెక్టులకు అయ్యే ఖర్చును మాత్రం రాష్ట్ర ప్రభుత్వం ఒక్క రూపాయి కూడా భరించడం లేదు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పీఎం సూర్యఘర్ పథకం ద్వారా సోలార్ రూఫ్‌టాప్‌ను ఏర్పాటు చేయనున్నారు. ఇందుకు కేంద్రం నుంచి కొంత సబ్సిడీ వస్తుంది. మిగతా మొత్తాన్ని కెఆర్‌ఈసీఎస్‌ఎల్‌గానీ, ఆంధ్రప్రదేశ్ మధ్య ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ(ఏపీసీపీడీసీఎల్)గానీ పెట్టుబడిగా భరించాల్సి ఉంటుంది. అలా పెట్టిన పెట్టుబడి 3 నుంచి 5 ఏళ్లలో తిరిగి వస్తుందని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఇక సోలార్ పంపుసెట్లకు పీఎం కుసుమ్ పథకం ద్వారా వచ్చే నిధులతో ఏర్పాటు చేసుకోవాలని, దీనికి రాష్ట్ర ప్రభుత్వానికి నిధులు అడగనవసరం లేదని స్పష్టం చేశారు.

భక్త కన్నప్ప త్యాగం.. నీలకంఠుడి రూపం





కాఫీ పౌడర్‌తో వేసిన పరమశివుడి చిత్రాలు

చిత్తూరు రూరల్ (కాణిపాకం): మహా శివరాత్రిని పురస్కరించుకుని యాదమరి మండలంలోని ఓ ఆర్ట్ మాస్టర్ కాఫీ పౌడర్‌తో శివదర్శనం-నిదర్శనం పేరుతో పరమాత్ముడి చిత్రానికి ప్రాణంపోశారు. సాలెపురుగు, సర్పం, ఏనుగు.. కళ్లను అర్పించి..శివ దర్శనంతో భక్త కన్నప్పగా మారిన ఉదంతాన్ని అద్భుతంగా గీశారు. నీలకంఠలీల క్షీరసాగరం మధనంలో ఉద్భవించి హాలాహలాన్ని శివుడు ఆరగించే విధానాన్ని దామోదరం అనే ఆర్ట్ మాస్టర్ తన చిత్రంలో అద్భుతంగా చూపించారు.

3 నుంచి పదో తరగతి గ్రాండ్ టెస్టులు

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లా వ్యాప్తంగా అన్ని ప్రభుత్వ యాజమాన్యాల్లో మార్చి 3వ తేదీ నుంచి పదో తరగతి గ్రాండ్ టెస్టులు నిర్వహించనున్నారు. ఈ మేరకు రాష్ట్ర విద్యాశాఖ అధికారులు పరీక్షల షెడ్యూల్‌ను జారీ చేశారు. ఆ షెడ్యూల్ మేరకు పరీక్షలు పకడ్బందీగా నిర్వహించేందుకు జిల్లా విద్యాశాఖ అధికారులు కసరత్తు చేస్తున్నారు. జిల్లాలోని అన్ని యాజమాన్యాల ఉన్నత పాఠశాలల్లో గ్రాండ్‌టెస్ట్‌లు తప్పనిసరిగా నిర్వహించాలని డీఈఓ వరలక్ష్మి ఆదేశించారు. ఈ పరీక్షలు ప్రతి రోజు మధ్యాహ్నం 1.30 గంట నుంచి సాయంత్రం 4.45 గంటల వరకు నిర్వహించనున్నారు.

షెడ్యూల్ ఇలా.....

మార్చి-3వ తేదీన మొదటి లాంగ్వేజ్, కాంపోజిట్ కోర్సు, మార్చి 4వ తేదీన సెకండ్ లాంగ్వేజ్, మార్చి 5న ఇంగ్లీష్, 6న మొదటి లాంగ్వేజ్ పేపర్ (కాంపొజిట్‌కోర్సు), 7న గణితం, 10న ఫిజికల్ సైన్స్, 11న బయాలజికల్ సైన్స్, 12న ఓఎస్‌ఎస్‌సీ మెయిన్ లాంగ్వేజ్ పేపర్-2, ఒకేషనల్ కోర్స్ థియరీ, 13న సోషల్ స్టడీస్ పరీక్షలు నిర్వహించాలని షెడ్యూల్‌లో పేర్కొన్నారు.

సీఎం పర్యటనను విజయవంతం చేయండి

గంగాధర నెల్లూరు : రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు మార్చి1న చిత్తూరు జిల్లా పర్యటనలో భాగంగా జీడీ నెల్లూరు మండలంలో పర్యటించనున్నారు. ఈ నేపథ్యంలో మంగళవారం జీడి నెల్లూరు హరిజన వాడ, రామానాయుడు పల్లిలో సభా వేదిక, హెలీప్యాడ్‌కు సంబంధించిన ఏర్పాట్లపై కలెక్టర్ సుమిత్ కుమార్, జిల్లా ఎస్పీ మణికంఠ చందోలు , ముఖ్యమంత్రి కార్యక్రమాల సమన్వయకర్త వెంకటేష్‌తో కలసి పరిశీలించారు. ముఖ్యమంత్రి పర్యటన నేపథ్యంలో కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు, కాన్వాయ్ నిర్వహణ, ప్రజా వేదిక, పెన్షన్ పంపిణీకి లబ్ధిదారుల ఎంపిక సంబంధిత అంశాలపై చర్చించారు. పరిశీలనలో జాయింట్ కలెక్టర్ విద్యాధరి, అసిస్టెంట్ కలెక్టర్ హిమవంశీ, అడిషనల్ ఎస్పీ శివానంద కిషోర్, పీఆర్ ఎస్ఈ చంద్రశేఖర్ రెడ్డి, డీఆర్‌డీఏ పీడీ శ్రీదేవి, చిత్తూరు ఆర్డీఓ శ్రీనివాసులు, ఎస్పీడీసీఎల్ ఎస్ఈ ఇస్మాయిల్, డీఎస్పీ సాయినాథ్, అధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

చెరకు తోట దగ్ధం



వెదురుకుప్పం : మండలంలోని యనమలమంద గ్రామంలో జరిగిన అగ్ని ప్రమాదంలో రైతు నీలకంఠానికి చెందిన చెరకు తోట దగ్ధమైంది. మంగళవారం సాయంత్రం జరిగిన విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో ప్రమాదం సంభవించిందని బాధిత రైతు తెలిపారు. నాలుగెకరాల్లో చెరకు పంట కాలిబూడిదయినట్లు చెప్పారు. ఈ ప్రమాదంలో సుమారు రూ. 5 లక్షల ఆస్తి నష్టం వాటిల్లినట్లు ఆవేదన వ్యక్తం చేశారు.

విద్యుదాఘాతంతో మహిళా కూలీ మృతి



మృతి చెందిన చిట్టెమ్మ

బంగారుపాళెం : కూలీ పనులకు వెళ్లి పొలం వద్ద విద్యుదాఘాతానికి గురై మహిళా వ్యవసాయ కూలీ మృతి చెందిన సంఘటన మంగళవారం మండలంలోని ఎస్.కోటూరు గ్రామంలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. ఎస్.కోటూరు దళితవాడలో నివాసం ఉంటున్న సదాశివయ్య భార్య చిట్టెమ్మ(55) వ్యవసాయ కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తోంది. ఈ నేపథ్యంలో అదే గ్రామానికి చెందిన సురేంద్రబాబు వ్యవసాయ బావి వద్ద వరిలో కలుపు తీసేందుకు వెళ్లింది. పొలం పక్కన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌కు రక్షణ కంచె కమ్మికి పచ్చటి తీగలు అల్లుకుపోయాయి. ప్రమాదవశాత్తు రక్షణ కంచె కమ్మిని చిట్టెమ్మ చేతితో తాకడంతో విద్యుదాఘాతంతో తీవ్రంగా గాయ పడింది. సహచర కూలీలు ఆమెను చికిత్స నిమిత్తం బంగారుపాళెం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టానికి తరలించారు. బాధితురాలి భర్త సదాశివయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

పూతలపట్టు వీఆర్‌ఓ హఠాన్మరణం



ధరణికృష్ణ (ఫైల్)

పూతలపట్టు (కాణిపాకం): పూతలపట్టు మండల కేంద్రానికి సంబంధించిన వీఆర్‌ఓ ధరణికృష్ణ (38) మంగళవారం గుండె పోటుతో మృతిచెందారు.ఈయన పెనుమూరు మండలం పులికల్లు స్వగ్రామం. ఇంట్లో మధ్యాహ్నం భోజనం చేసి పడుకున్న కొద్ది సేపటికే గుండెపోటు గురై అపస్మారస్థితికి వెళ్లిపోయారు. ఈవిషయాన్ని గమనించిన కుటుంబికులు పెనుమూరులోని ఆస్పత్రికి తీసుకెళ్లారు. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. కాగా పని ఒత్తిడి కారణంగానే గుండె పోటుకు గురై మృతి చెందినట్లు పలువురు రెవెన్యూ సిబ్బంది ఆరోపిస్తున్నారు.

ఇష్టం లేని పెళ్లిపై యువతి ఆత్మహత్యాయత్నం

పాలసముద్రం : ఓ యువతికి సమీప బంధువుతో కట్టబెట్టాలని బలవంతం చేయడంతో యువతి ఆత్మహత్యాయత్నానికి ప్రయత్నించిన సంఘటన మంగళవారం చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. తమిళనాడు సరిహద్దులోని గ్రామానికి చెందిన ఓ యువతి గార్మెంట్స్‌లో పనిచేస్తోంది. మంగళవారం మధ్యాహ్నం యువతి బంధువులు తమ సమీప బంధువుతో పెళ్లి చేసుకోవాలని బలవంతం చేయడంతో ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని బావి చుట్టు ప్రక్కల గాలించడంతో ఆ యువతి ముళ్లపొదల్లో ఉన్నట్లు గుర్తించి యువతి కుటుంబ సభ్యులకు కౌన్సెలింగ్ ఇచ్చి యువతిని అప్పగించారు. కాగా ఆ యువతికి ఇంతక ముందే వివాహమై విడిపోయినట్లు బంధువులు తెలిపారు.

చందాలతో వేసుకున్న రోడ్డుకు కూటమి బిల్లు ?



భక్తుల చందాలతో నిర్మించుకున్న రోడ్డు

శాంతిపురం : దేవుడి ఊరేగింపును తీసుకురావటానికి తాము ఏర్పాటు చేసుకున్న మట్టి రోడ్డుకు స్థానిక టీడీపీ నేతలు బిల్లు పెట్టుకునే ప్రయత్నం చేస్తున్నారని భక్తులు ఆరోపించారు. కొలమడుగు పంచాయతీలోని కదిరిముత్తనపల్లిలో సిద్దేశ్వర స్వామి ఆలయం ఉంది. పొరుగున ఉన్న రెడ్లపల్లి గ్రామస్తులు కొందరు శివరాత్రి సందర్భంగా తమ గ్రామంలో దేవుడి ఊరేగింపు జరపాలనుకుని నిర్ణయించుకున్నారు. తలా కొంత చందాలు వేసుకుని రెండు గ్రామాల మధ్య పాలారు నదిలో తాత్కాలిక మట్టి రోడ్డును రెండు రోజుల కిందట నిర్మించుకున్నారు. మరో నెల రోజుల్లో సిద్దేశ్వరస్వామి ఆలయంలో 12 ఏళ్లకు ఓసారి జరిగే కురబ కులస్తుల జాతరకు ఈ రోడ్డు ఉపయోగపడుతుందని అనుకున్నారు. కానీ కొందరు టీడీపీ నాయకులు సోమవారం పంచాయతీరాజ్ ఇంజినీరును తీసుకొచ్చి మట్టి రోడ్డు ఫొటోలు తీసుకుపోయినట్లు గుర్తించారు. దీంతో తాము భక్తితో నిర్మించుకున్న మట్టి రోడ్డును చూపి అధికార పార్టీ నాయకులు బిల్లు చేసుకోకుండా చూడాలని కోరుతూ గ్రామస్తులు వాపోయారు. అదే రోడ్డుపై నిరసన తెలిపి, ఎంపీడీఓకు వినతి పత్రం ఇచ్చారు.

మారథాన్ వీరుడి మరో ఘనత





ఢిల్లీ మారథాన్‌లో పాల్గొన్న సీఐ రామకృష్ణ

చిత్తూరు అర్బన్ : దేశంలో ఎక్కడా మారథాన్ జరిగినా అందులో పాల్గొనే సీఐ రామకృష్ణ తన కెరీర్‌లో మరో మారథాన్ పూర్తి చేశారు. గత ఆదివారం ఢిల్లీలో జరిగిన పూర్తిస్థాయి మారథాన్‌లో పాల్గొన్న ఆయన 3.26 గంటల్లో పరుగును పూర్తి చేశారు. గతేడాది ముంబైలో జరిగిన టాటా మారథాన్‌లో 42.2 కిలోమీటర్ల దూరాన్ని 3.21 గంటల్లో పూర్తి చేసిన ఆయన.. తాజా మారథాన్‌లో 5 నిముషాల నిడివిని తగ్గించి, లక్ష్యాన్ని పూర్తి చేశారు. తన తరువాతి మారథాన్‌ను 3.05 గంటల్లో పూర్తిచేయాలనే లక్ష్యంతో ప్రాక్టీస్ చేస్తున్నట్లు రామకృష్ణ తెలిపారు. కాగా తిరుపతి పోలీసు శిక్షణ కేంద్రంలో రామకృష్ణ పనిచేస్తున్నారు.

సింహ వాహనంపై శివతేజం



మొగిలిలో అధికార నంది వాహనంపై విహరిస్తున్న పరమేశ్వరుడు

బంగారుపాళెం : మొగిలి మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలలో భాగంగా మూడో రోజు మంగళవారం ఉదయం పరమేశ్వరుడైన శ్రీ మొగిలీశ్వరస్వామి, కామాక్షమ్మ వారు మొదట అధికార నంది వాహనాన్ని అధిరోహించి భక్తలకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా శ్రీస్వామి, అమ్మ వార్లకు ఆలయ అర్చకులు ప్రత్యేక అభిషేక పూజలు నిర్వహించారు. అలంకార మండపంలో ఉత్సవమూర్తులను వివిధ రకాల పుష్పాలతో నయనానందకరంగా అలంకరించారు. అనంతరం నంది వాహనంపై కొలువుదీర్చి ఆలయ మాడవీధుల్లో ఘనంగా ఊరేగించారు. రాత్రి ఆదిశంకరుడైన మొగిలీశ్వరస్వామి, కామాక్షమ్మవారు సింహ వాహనంపై భక్తులకు కనువిందు చేశారు. అభిషేకానంతరం స్వామి, అమ్మ వారి ఉత్సవ మూర్తులను విశేషంగా అలంకరించి సింహ వాహనంపై కొలువుదీర్చారు. బాజాభజంత్రీల నడుమ ఆలయ మాడ వీధుల మీదుగా విహరిస్తూ భక్తులకు దర్శనమిచ్చారు.

నేడు మహాశివరాత్రి

బ్రహ్మోత్సవాలలో భాగంగా బుధవారం మహాశివరాత్రి ప్రత్యేక పూజలు, అభిషేకాలు రాత్రి 12 గంటలకు లింగోద్భవ అభిషేకం, వృషభ వాహన సేవా కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు ఈఓ మునిరాజ తెలిపారు.

పాఠశాల విద్యార్థుల ఈవ్ టీజింగ్!

శాంతిపురం : స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఆరో తరగతి చదువుతున్న విదార్థినులను అదే పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న విద్యార్థి, తన స్నేహితులు టీజింగ్ చేయడం కలకలం రేపింది. సోమవారం సాయంత్రం స్కూలు ముగిశాక జాతీయ రహదారి మీదుగా ఇంటికి కాలి నడకన బాలికలు బయలుదేరారు. అదే సమయంలో మరో గ్రామానికి చెందిన 9వ తరగతి విద్యార్థి, తన మిత్రులతో కలిసి బైకుపై వచ్చి అమ్మాయిలపై పూలు చల్లుతూ ఆకతాయి వేషాలు వేశారు. బాలికలు ఇంటికి వెళ్లి తమ తల్లి దండ్రులకు చెప్పడంతో మంగళవారం వారు పాఠశాలకు వచ్చి హెచ్‌ఎం నటరాజరెడ్డికి ఫిర్యాదు చేశారు. దీంతో 9వ తరగతి విద్యార్థి కుటుంబ సభ్యులను పిలిపించిన హెచ్‌ఎం వారిని హెచ్చరించి పంపారు. నిందితుడు, బాధిత బాలికలు అందరూ మైనర్లే కావడంతో వారికి వేర్వేరుగా కౌన్సెలింగ్ ఇచ్చారు.

అశేషం..శివోహం!



పురవీధుల్లో ఊరేగుతున్న స్వామి, అమ్మవార్లు

శ్రీకాళహస్తి: మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం రాత్రి స్వామివారు శేష వాహనంపై, అమ్మవారు యాళి వాహనంపై ఆసీనులై పురవీధుల్లో ఊరేగుతూ భక్తులను కటాక్షించారు. మొదట స్వామి, అమ్మవార్లను ఆలయ అలంకార మండపంలో సర్వాంగసుందరంగా అలంకరించారు. మేళతాళాలు, మంగళ వవాయిద్యాలు, వేదమంత్రాల నడుమ స్వామి అమ్మవార్లను ఊరేగింపుగా తీసుకుని రాజగోపురం వద్దకు వేంచేశారు. అక్కడ స్వామివారిని శేష వాహనంపై, అమ్మవారిని యాళి వాహనంపై అధిష్ఠింపజేశారు. అనంతరం పురవీధుల్లో ఊరేగుతూ భక్తులను అనుగ్రహించారు.

హంస, శుక వాహనాలపై ఆదిదంపతులు..

ఐదో రోజైన మంగళవారం ఉదయం శ్రీకాళహస్తీశ్వరస్వామి బంగారు హంస వాహనంపై, జ్ఞాన ప్రసూనాంబ అమ్మవారు శుక వాహనంపై పురవీధుల్లో ఊరేగారు. మూషిక వాహనంపై వినాయకస్వామి, చప్పరాలపై శ్రీవల్లీ, దేవసే సమేత కుమారస్వామి, చండికేశ్వరుడు, భక్తకన్నప్ప కొలువుదీరి స్వామి, అమ్మవార్లను అనుసరించారు. కళాకారుల కోలాటాలు, శివనామస్మరణతో ఆలయ పరిసరాలు మార్మోగాయి. ఈఓ బాపిరెడ్డి పాల్గొన్నారు.

పట్టువస్త్రాల సమర్పణ

శ్రీకాళహస్తీశ్వర స్వామి వారికి రాష్ట్ర ప్రభుత్వం తరుపున రాష్ట్ర దేవదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి చేతులమీదుగా పట్టు వస్త్రాలు అందజేశారు. శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి, కలెక్టర్ వెంకటేశ్వర్, ఈఓ బాపిరెడ్డి ఆయనకు ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం స్వామివారికి పట్టు వస్త్రాలు సమర్పించారు.